# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



News Portal Designing
Epaper Designing &
Web Hosting
Vn Media
+91 8099779988
vntelugudaily@gmail.com



సంపుటి : 3 | సంచిక : 59 | మంగళవారం 4 ఫిబ్రవరి 2025 | పేజీలు : 8 | వెల : 5/-
Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




త్వరలో 100 అమృత్

## భారత్ రైళ్లు


- తెలుగు రాష్ట్రాలకు భారీగా కేటాయింపులు
- సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తాం
- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్
- తెలంగాణ నుంచి మరిన్ని వందే భారత్ రైళ్లు నడుపుతాం
- కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం
- 2026 లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీని అందుబాటులోకి తెస్తాం

# రాష్ట్రంలో రాజకీయ వేడీ

- తెలంగాణ గట్టుపై ఆసక్తికర రాజకీయాలు
- రేపే ఎన్నికలు ఉన్నాయన్నంతగా అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ ఏ మాత్రం తగ్గడం లేదు.
- గులాబీ బాస్ కేసీఆర్ సడెన్‌గా ఎంట్రీ
- అంతేకాదు తాను కొడతే మామూలుగా ఉండదంటూ..కాంగ్రెస్ సర్కార్‌కు వార్నింగ్
- కాంగ్రెస్ పార్టీకి చెందిన దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు.. సీక్రెట్ మీటింగ్ పెట్టుకున్నారంటూ న్యూస్ చక్కర్లు

హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రంగా.. తెలంగాణ గట్టు మీద ఇంట్రెస్టింగ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. ఇష్యూ ఏదైనా..టాపిక్ మరేదైనా పీక్‌లెవల్ పొలిటికల్ హీట్‌ను క్రియేట్ చేస్తోంది. రేపే ఎన్నికలు ఉన్నాయన్నంతగా అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ ఏ మాత్రం తగ్గడం లేదు. సరిగ్గా ఇదే టైమ్‌లో - మిగతా3లో





ఈనెల 15లోపు

## పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

- నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి
- నిత్యం ప్రజల్లో ఉండాలి
- గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్

తెలంగాణలో పంచాయతీ ఎన్నికలకు నగారా మోగనుంది. ఫిబ్రవరి 15లోపు స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ రానుంది. ఈ మేరకు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులంతా సర్పంచ్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణలో కులగణన రిపోర్ట్ వచ్చేసింది. నెక్ట్స్ ఏంటో కూడా క్లారిటీ ఇచ్చారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. అతి త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఫిబ్రవరి 15లోపు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని - మిగతా3లో



నా అమెరికా పర్యటనపై

## రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం

- రాహుల్ మాటల్లో ఎంతమాత్రం వాస్తవం లేదు
- బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌లోని సెక్రటరీ, ఎన్ఎస్ఏను కలిసేందుకు వెళ్లాను
- ఆ తర్వాత మన కాన్సుల్ జనరల్ సమావేశానికి అధ్యక్షత వహించాను
- కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్

# ప్రతి ఒక్కరికీ విద్యా అందాలి

- రాష్ట్రంలో ప్రతి ఒక్క బిడ్డ ఉన్నత విద్యావంతుడై ఉండాలి
- దేశంలో కూడా అన్ని రంగాల్లో ముందు ఉండాలి
- విద్యా వ్యవస్థపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఆదర్శ ఇందిరమ్మ పాఠశాలలు, నూతన నియామకాలు మౌలిక సదుపాయాలు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నాం
- ప్రధాన రాజకీయ పార్టీ పెద్దలు కులగణనలో వివరాలు ఇవ్వలేదు



సిద్దిపేట జిల్లా:

తెలంగాణలో విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయంయ తీసుకుంది. ప్రభుత్వ పక్షాన విద్యవ్యవస్థను మెరుగుపరచడానికి ప్రతి ఒక్కరికీ విద్యా అందటానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదర్శ ఇందిరమ్మ పాఠశాలలు, నూతన నియామకాలు మౌలిక సదుపాయాలు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. వసంత పంచమినీ పురస్కరించుకొని సోమవారం వర్గల్ మండల కేంద్రంలోనీ శ్రీ విద్య - మిగతా3లో

### దేశంలో మకాం వేసిన చైనా

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ
- 'మేక్ ఇన్ ఇండియా' ఆలోచన మంచిదే అయినా దానిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది
- ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోలేకపోయింది
- అందువల్లే చైనా ఇక్కడ మకాం వేసింది

# తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టులు



- పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు, ఐదు ఎయిర్‌పోర్టులు
- రాష్ట్రంలో మాత్రం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఒక్కటే దిక్కు
- రాష్ట్రంలో ఎయిర్ పోర్టులు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది.
- తెలంగాణలోని నాలుగు ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అడుగులు పడనున్నాయి
- తాజా కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా... 120 కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటుచేస్తామని ప్రకటన

హైదరాబాద్

తెలంగాణలో ఎయిర్‌పోర్టులు చాలా తక్కువ. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు, ఐదు ఎయిర్‌పోర్టులు ఉంటే.. రాష్ట్రంలో మాత్రం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఎక్కటే దిక్కు. బేగంపేట ఎయిర్‌పోర్టు వీఐపీల కోసం వినియోగిస్తుండగా.. వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్టు నిజాం కాలంలో సేవలందించేది. ప్రస్తుతం మాత్రం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి మాత్రమే విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎయిర్ పోర్టులు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కీలక ప్రకటన చేశారు. పొరుగు రాష్ట్రాల్లో బస్ డిపోల మాదిరిగా - మిగతా3లో

## పిల్లల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోంది

- చెట్టు కింద విద్యార్థులతో మోదీ ముచ్చట్లు..
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- విద్యార్థుల భవిష్యత్తు కంటే సొంత ప్రతిష్టను పెంచుకునేందుకే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది
- సరైన రిజల్ట్స్ రాకపోతే ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు
- ఇది విద్యావ్యవస్థలో నిజాయితీ లోపించడమే అవుతుంది



# త్వరలో 100 అమృత్ భారత్ రైళ్లు



సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ నుండి మరిన్ని వందే భారత్ రైళ్లను నడుపుతామని తెలిపారు. కాజీపేట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, కొన్ని పనులకు అనుమతులు రావాల్సి ఉన్నందున ఆలస్యమవుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమైన స్టేషన్ల పరిధిలో రక్షణ వ్యవస్థ కవచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. 2026లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర రైల్వే, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ముఖ్య స్టేషన్ల పరిధిలో కవచ్ టెక్నాలజీని వేగంగా ఏర్పాటు చేస్తున్నామని, త్వరలో అన్ని చోట్ల పూర్తిచేస్తామని తెలిపారు. అలాగే.. సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రైల్వే బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు కేటాయింపులు జరిగాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో సోమవారం అశ్విని వైష్ణవ్ మాట్లాడారు. త్వరలో దేశవ్యాప్తంగా 100 అమృత్ భారత్ రైళ్లు కూడా వస్తాయని అశ్విని వైష్ణవ్ తెలిపారు. 200 వందే భారత్ రైళ్లు కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మొత్తం రైల్వే నెట్‌వర్క్‌లో ఆటోమేటిక్ రైలు రక్షణ టెక్నాలజీ కవాచ్‌ను అమలు చేస్తామని తెలిపారు. 2026 నాటికి కవాచ్ వ్యవస్థను దేశవ్యాప్తంగా అమలు చేస్తామని.. రైల్వే భద్రత కోసం ఎన్నో సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. ఇండియన్ రైల్వే కోసం 2.52 లక్షల కోట్లను కేంద్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణలో 1,026 కిలోమీటర్ల మేరకు కవచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2026 నాటికి దేశమంతటా కవచ్ టెక్నాలజీ అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ నుంచి ఐదు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయని ఆయన అన్నారు. రాష్ట్రంలో అన్ని రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయని ఆయన తెలియజేశారు. పేదల కోసం తాము నమో భారత్ రైళ్లను నడుపుతున్నామని, త్వరలో దేశమంతటా దాదాపు వంద నమో భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన వెల్లడించారు. రైల్వేబడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,417 కోట్లు కేటాయింపులు జరిగాయని తెలిపారు. ఏపీలో రూ.84,559 కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు.. అలాగే.. ఏపీలో 73 రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 1560 కి.మీ.కొత్త రైల్వేలైన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఏపీకి యూపీఏ హయాం కంటే.. ఎక్కువ నిధులను కేటాయించినట్లు తెలిపారు. ఏపీకి 11 రెట్ల కేటాయింపులు పెరిగాయని వివరించారు. ఇక రైల్వే బడ్జెట్‌లో తెలంగాణకు రూ.5337 కోట్లు నిధులు మంజూరు చేశామని అశ్విని వైష్ణవ్ తెలిపారు. కాజీపేటలో రైల్వేప్రొడక్షన్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటి వరకు తెలంగాణకు రూ.41,677 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పారు. తెలంగాణ వ్యాప్తంగా 1326కి.మీ కవచ్ టెక్నాలజీ పనిచేస్తోందని తెలిపారు.

# పిల్లల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోంది



**న్యూఢిల్లీ:** విద్యార్థుల భవిష్యత్తు కంటే సొంత ప్రతిష్టను పెంచుకునేందుకే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును ఆప్ నాశనం చేస్తోందని అన్నారు. ఢిల్లీ విద్యార్థులతో మోదీ సోమవారంనాడు ముఖాముఖీ సంభాషించారు. ఆప్ విద్యా విధానంపై విమర్శలు గుప్పించారు. "తొమ్మిదవ తరగతి దాటి చదివేందుకు ఢిల్లీ పాఠశాలల్లో విద్యార్థులను వాళ్లు (ఆప్ ప్రభుత్వం అనుమతించడం లేదని విన్నాను. పాస్ గ్యారెంటీ అనుకున్న వాళ్లనే పైతరగతులకు పంపిస్తున్నారని తెలిసింది. సరైన రిజల్ట్స్ రాకపోతే ప్రభుత్వం పరువు పోతుందని వారు భావిస్తున్నారు. ఇది విద్యావ్యవస్థలో నిజాయితీ లోపించడమే అవుతుంది" అని విద్యార్థులతో ప్రధాని అన్నారు. 9,11 తరగతుల్లో ఫెయిలవుతున్న విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందంటూ గతంలో పలు కథనాలు వచ్చిన నేపథ్యంలో ప్రధాని వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**అభివృద్ధి గాలులు వీస్తున్నాయి..**

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారం సాయంత్రం ముగియనుండటంతో ప్రధానమంత్రి గత కొద్దిరోజులుగా వరుస ర్యాలీల్లో పాల్గొంటూ ప్రజలు మార్పు కోరుకుంటు న్నారంటూ ప్రచారం సాగించారు. ఆదివారంనాడు ఆర్కే పురం ర్యాలీలో వసంత పంచమి రాకతో వాతావరణంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోందని, ఢిల్లీలో మరికొద్ది రోజుల్లో అభివృద్ధి గాలులు వీచనున్నాయని అన్నారు. ఈసారి ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందన్నారు. ఆప్ ప్రభుత్వం 11 ఏళ్లు వృథా చేసిందని, ఢిల్లీ ప్రజలకు సేవ చేసే ఒక్క అవకాశం తమకు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఎలాంటి సమస్య పరిష్కారానికైనా తాను వెనుకాడేదని లేదని హామీ ఇచ్చారు. ఢిల్లీలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం వస్తే ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబాల్లో వెలుగులు నిండుతాయని అన్నారు. ఒక్క మురికివాడను కూడా కూల్చే ప్రసక్తి లేదని, మురికివాడల్లో నివసించే వారికి కేవలం రూ.5కే పూర్తి పోషకాహారం అందిస్తామని, అటోడ్రైవర్లు, డొమిస్టిక్ వర్కర్ల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రస్తుతం అమల్లో ఉన్న పథకాలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

# 'శీష్ మహల్'ను తెరుస్తాం: అమిత్‌షా



న్యూఢిల్లీ: కోట్లాది రూపాయల ప్రజాధనంతో అరవింద్ కేజ్రీవాల్ నిర్మించిన "శీష్ మహల్" ను ప్రజా సందర్శన కోసం తెరుస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హామీ ఇచ్చారు. రూ.51,000 కోట్ల ప్రజాధనంతో అద్దాలమేడ (శీష్ మహల్)ను కేజ్రీవాల్ నిర్మించారని అన్నారు. జాంగ్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడుతూ, కేజ్రీవాల్‌కు ఒక ఇల్లుతో సంతృప్తి లేకనే 'అద్దాలమేడ' నిర్మించుకున్నారని చెప్పారు. "ముఖ్యమంత్రి అయ్యాక ఇల్లు కానీ, కారు కానీ, సెక్యూరిటీ కానీ తీసుకోనని 2013లో కేజ్రీవాల్ చెప్పారు. అయితే ఆ తర్వాత కారు, బంగ్లా తీసుకున్నారు. ఒక బంగ్లాతో ఆయనకు తృప్తి కలగలేదు. దాంతో శీష్ మహల్ నిర్మించారు. అందుకైన రూ.51,000 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయి? అదంతా ఢిల్లీ ప్రజలకు చెందిన సొమ్ము. శీష్ మహల్‌ను ప్రజాసందర్శన కోసం ఉంచుతామని నేను వాగ్దానం చేస్తున్నారు. కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన కేజ్రీవాల్‌కు తిరిగి ఓటు వేసి అధికారం కట్టబెట్టాలా?" అని అమిత్‌షా ప్రశ్నించారు.

**ప్రతాప్‌గంజ్ ప్రజలను మోసం చేసిన సిసోడియా**

ప్రతాప్‌గంజ్ ప్రజలను మాజీ ఉమ ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా మోసం చేశారని అమిత్‌షా ఆరోపించారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేయడంతో ఎక్కడ ప్రజలు నిలదీస్తారో అనే భయంతో ఆయన ప్రతాప్ గంజ్ నియోజకవర్గాన్ని వదిలిపట్టి జాంగ్‌పురకు వెళ్లిపోయారని అన్నారు. ఇదే సిసోడియా డిప్యూటీ సీఎంగా ఆలయాలు, స్కూళ్లు, గురుద్వారాల సమీపంలో లిక్కర్ దుకాణాలు తెరిపించారని, దేశంలోనే ఒక లిక్కర్ స్కామ్‌లో జైలుకు వెళ్లిన ఏకైక విద్యాశాఖ మంత్రి ఆయనేనని విమర్శించారు. బడే మియా (కేజ్రీవాల్) చోటో మియా (సిసోడియా) కలిసి ఢిల్లీ ప్రజలను వంచించారని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగియనుంది. ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.


# సీఈసీకి బీజేపీ ఆఫర్ : కేజ్రీవాల్ తీవ్ర వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరి కొద్ది గంటల్లోనే ముగియాల్సి ఉన్న తరుణంలో భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌పై ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీకి సీఈసీ లొంగిపోవడం చూస్తుంటే ఎన్నికల కమిషన్ తన అస్థిత్వం కోల్పోయినట్టు కనిపిస్తోందని అన్నారు. ఈ నెలాఖరులతో సీఈసీ రిటైర్ అవుతుండటంతో ప్రజల మనసుల్లో ఇలాంటి ఎన్నో ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెప్పారు. "రిటైర్మెంట్ తరువాత ఆయనకు ఏ పోస్ట్ ఆఫర్ చేశారు, గవర్నర్ పోస్టా, రాష్ట్రపతి పోస్టా? ఏ పోస్ట్ కావచ్చు?" అని మీడియాతో మాట్లాడుతూ కేజ్రీవాల్ అన్నారు. "రాజీవ్ కుమార్‌ను ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను. మీ బాధ్యతలను మీరు న్యాయబద్ధంగా నిర్వర్తించండి. పదవి కోసం పాకులాడవద్దు. మీ పదవీకాలం చివర్లో దేశాన్ని, దేశ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయవద్దు" అని కేజ్రీవాల్ కోరారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో డబ్బులు పంచుతున్నారంటూ బీజేపీ ప్రత్యర్థి పర్వేష్ వర్మపైన కేజ్రీవాల్ ఇటీవల ఆరోపించారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల కమిషన్ చేష్టలుడిగి చూస్తోందని అన్నారు. ఆప్ కార్యకర్తలను ప్రచారం చేయకుండా బీజేపీ అడ్డుకుంటోందని, దాడులు చేస్తోందని ఆరోపించారు. న్యూఢిల్లీ నియోజకవర్గానికి ప్రత్యేక పరిశీలకులను నియమించాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఉంది. ఆప్ అభ్యర్థిగా కేజ్రీవాల్ పోటీలో ఉండగా, బీజేపీ నుంచి పర్వేష్ వర్మ, కాంగ్రెస్ నుంచి సందీప్ దీక్షిత్ పోటీ పడుతున్నారు.



ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## నా అమెరికా పర్యటనపై రాహుల్ వ్యాఖ్యలు నిరాధారం



**న్యూఢిల్లీ:** డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాలని కోరేందుకు గత డిసెంబర్‌లో తాను అమెరికా వెళ్లినట్టు రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలను కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ఖండించారు. రాహుల్ మాటల్లో ఎంతమాత్రం వాస్తవం లేదన్నారు. ఉద్దేశపూర్వకంగానే ఆయన అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని తప్పుపట్టారు. "2024 డిసెంబర్‌లో నా అమెరికా పర్యటనపై విపక్ష నేత అవాస్తవాలు మాట్లాడారు. బైడెన్ అడ్మినిస్ట్రేషన్ లోని సెక్రటరీ, ఎన్ఎస్ఏను కలిసేందుకు వెళ్లాను. ఆ తర్వాత మన కాన్సుల్ జనరల్ సమావేశానికి అధ్యక్షత వహించాను. ఏ దశలోనూ ప్రధానమంత్రికి ఆహ్వానం విషయంపై చర్చ జరగలేదు. మన ప్రధాని సహజంగా అలాంటి ఈవెంట్లకు వెళ్లరనే విషయం అందరికీ తెలిసిందే. ప్రత్యేక ప్రతినిధులనే భారత్ పంపుతుంటుంది. రాహుల్ రాజకీయ ఉద్దేశాలతో ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉండొచ్చు. కానీ ఇలాంటి వ్యాఖ్యలు విదేశాల్లో మన దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తాయి" అని జైశంకర్ అన్నారు.

**రాహుల్ ఏమన్నారు?**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ట్రంప్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి నరేంద్ర మోదీని ఆహ్వానించాల్సిందిగా కోరేందుకు విదేశాంగ మంత్రి పలుమార్లు అమెరికా వెళ్లారని అన్నారు. మనకంటూ ఒక ఉత్పత్తి వ్యవస్థ, సొంత టెక్నాలజీ ఉంటే అమెరికా అధ్యక్షుడే ఇక్కడకు వచ్చి ప్రధానిని ఆహ్వానిస్తారని వ్యాఖ్యానించారు. దేశంలో ఉత్పత్తి, సాంకేతికరంగాలపై భారత్ పూర్తి స్థాయి దృష్టి పెట్టాలని చెబుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**తప్పుపట్టిన కిరణ్ రిజిజు**

రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తప్పుపట్టారు. దేశ ప్రధాని గురించి ప్రతిపక్ష నేత ఇలాంటి నిరాధార ఆరోపణలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. రెండుదేశాల మధ్య సంబంధాలకు చెందిన అంశంపై సరైన నిర్ధారణ లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. దీనికి వెంటనే రాహుల్ సమాధానిమిస్తూ "మీ ప్రశాంతతకు భంగం కలిగించినందుకు క్షమాపణ చెబుతున్నాను" అన్నారు.

## దేశంలో మకాం వేసిన చైనా



**న్యూఢిల్లీ:** ఉత్పత్తి ఆధారిత దేశంగా భారత్ విఫలమై దానిని చైనాకు అప్పగించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఆలోచన మంచిదే అయినా దానిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో సోమవారంనాడు చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, ఉత్పత్తి రంగంలో భారత్ నిలదొక్కుకోలేకపోయిందని, అందువల్లే చైనా ఇక్కడ మకాం వేసిందని అన్నారు. ఇప్పటికైనా తయారీ రంగంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి ఉందన్నారు. సమాజంలో సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని తెలిపారు. చైనా దిగుమతుల ప్రభావంపై భారతీయ యువత ఆందోళనకు కారణమవుతోందని, ఇందువల్ల ఎదురయ్యే సమస్యలను గుర్తెరిగి ఉత్పత్తిరంగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' ఐడియా మంచిదే అయినా దాని ఫలితం కళ్లముందే ఉందన్నారు. 2014లో జీడీపీలో 15.3 శాతంగా ఉన్న మ్యాన్యుఫ్యాక్చరింగ్.. ఇవాళ 12.6 శాతంగా ఉందని, గత 60 ఏళ్లలో ఇది అత్యంత కనిష్టమని చెప్పారు. ప్రధానమంత్రిని తాను తప్పుపట్టడం లేదని, ఆయన ప్రయత్నించడం లేదని కూడా చెప్పనని, ఆయన ప్రయత్నించినా విఫలమయ్యారని చెప్పగలనని అన్నారు. చైనా జోక్యంపై రాహుల్ మరింత వివరిస్తూ, ప్రస్తుతం ఇండియాలో చైనీయులు ఉన్నారని, కానీ ప్రధాని దానిని తోసిపుచ్చుతున్నారని, అయితే ప్రధాని వాదనపై ఆర్మీ ఏకీభవించడం లేదని అన్నారు. "మొబిలిటీలో మార్పులకు నాలుగు టెక్నాలజీలు ప్రధానం. ఎలక్ట్రిక్ మోటార్స్, బ్యాటరీస్, ఆప్టిక్స్, వాటన్నింటికంటే టాప్‌లో ఏఐ ఉంటాయన్నారు. ఏఐ గురించి మాట్లాడేటప్పుడు అది సొంత ఏఐ కాకపోతే దానికి అర్థం లేదు. ఎందుకంటే అది డాటాపై ఆపరేట్ అవుతుంది. ఇవాళ మనం డాటాను చూస్తే, ప్రొడక్షన్ సిస్టమ్ నుంచి వచ్చే ప్రతి సింగిల్ డాటా చైనాదే" అని రాహుల్ అన్నారు.దేశంలోని యువతకు ఉద్యోగాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వలేకపోతోందని రాహుల్ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రతి ఏటా ఒకేలా ఉంటోందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

## ఆ ప్రభుత్వం వాహనదారులకు షాక్.. ఇలా చేస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!



ట్రాఫిక్ నిబంధనలపై బెంగళూరు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తూనే ఉన్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. అయితే కొందరు ట్రాఫిక్ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అలాంటి వారిపై బెంగళూర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. ట్రాఫిక్ జామ్ కారణంగా ఫుట్‌పాత్‌పై వెళ్లే వారిపై కొత్త అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. అలాగే ఫుట్‌పాత్‌లపై వాహనాలు నడిపే వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలని పోలీసులు నిర్ణయించారు. పాదచారుల భద్రత కోసం ట్రాఫిక్ పోలీసులు ఈ నిబంధనను అమలు చేశారు. గతంలో ఫుట్‌పాత్‌లపై వాహనాలు నడిపితే ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించేవారు. జరిమానా విధించినప్పటికీ, వాహనదారులు మాత్రమే మళ్లీ ఫుట్‌పాత్‌లపైనే నడుపుతున్నారు. దీంతో బెంగళూరు ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులు సమావేశమై డ్రైవింగ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేయాలని నిర్ణయించారు. మొదటిసారి నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తారు. పదే పదే పట్టుబడితే లైసెన్స్ సస్పెండ్ చేయనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. అందుకే ఇక నుంచి ఫుట్‌పాత్‌పై డ్రైవింగ్ చేసే ముందు ఆలోచించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. అయితే ఫుట్‌పాత్‌పై ఎక్కువగా బైక్‌లను నడుపుతున్నట్లు గుర్తించారు ట్రాఫిక్ పోలీసులు.

**రూ.80 లక్షల జరిమానాల వసూలు:**

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ట్రాఫిక్ పోలీసుల ఆపరేషన్ కొనసాగింది. జనవరి 27 నుండి ఫిబ్రవరి 2 వరకు పట్టుబడిన వారి నుంచి వసూలైన మొత్తం రూ. 80 లక్షలు. బెంగళూరులోని 50 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో తనిఖీలు జరిగాయి. గత వారంలో 800 వాహనాలను సీజ్ చేసినట్లు ట్రాఫిక్ పోలీస్ జాయింట్ కమిషనర్ ఎంఎన్ అనుచేత్ తెలిపారు.

# రాష్ట్రంలో రాజకీయ వేడీ

-మొదటిపేజీ తరువాయి

గులాబీ బాస్ కేసీఆర్ సడెన్ ఎంట్రీ ఇచ్చారు. అంతేకాదు తాను కొడతే మామూలుగా ఉండదంటూ..కాంగ్రెస్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఆయన మాటలు ఓ వైపు ప్రకంపనలు రేపుతుండగానే..మరోవైపు హస్తం పార్టీ ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ అంటూ వార్త తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు.. సీక్రెట్ మీటింగ్ పెట్టుకున్నారంటూ న్యూస్ చక్కర్లు కొడుతుండటంతో టీపాలిటిక్స్‌లో హైవోల్టేజ్ హీట్ కనిపిస్తోంది. కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..సర్కార్‌కు సలహాలు ఇవ్వాలంటూ..సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎన్నిసార్లు రెచ్చగొట్టినా.. ఫామ్‌హౌస్‌కే పరిమితం అయిన గులాబీ బాస్ కేసీఆర్..శుక్రవారం రోజు ఎంటర్ దీ డ్రాగన్ అంటూ హాట్ కామెంట్స్‌తో న్యూస్ మేకర్ అయ్యారు. తాను కొడితే మామూలుగా ఉండదంటూ రేవంత్ సర్కార్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇలా కేసీఆర్ మాస్ వార్నింగ్ ఇచ్చారో..? లేదో..? మూడు గంటలైనా గడవక ముందే..కాంగ్రెస్ ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ అంటూ ఓ వార్త బయటికి వచ్చింది. ఇద్దరు మంత్రుల తీరుపై..అసంతృప్తిగా ఉన్న కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్య మీటింగ్ పెట్టుకునారన్న వార్త.. రేవంత్ సర్కార్‌లో ఒక్కసారిగా కలవరానికి దారి తీస్తే..గులాబీ శిబిరంలో మాత్రం ఉత్సాహం నింపుతోందట. సీక్రెట్ భేటీ అంటూ జరుగుతున్న ప్రచారంపై సదరు ఎమ్మెల్యేలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. మీటింగ్ లేదు..గీటింగ్ లేదంటూ చెప్పుకొస్తున్నారు. అంతేకాదు ఇదంతా కేసీఆర్ కుట్ర అంటూ మరో కోణాన్ని తెరమీదకు తెచ్చారు. అక్కడితో ఆగకుండా బీఆర్ఎస్ సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు. ఇదంతా బయటికి బాగానే ఉన్నా..దాల్ మే కుఛ్ తో కాలా హై..అన్న గుసగుసలు అయితే వినిపిస్తున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ..ఏ ఒక్క పని కావడం లేదని ఆవేదనలో హస్తం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారట. ముఖ్యంగా బిల్లులు ఇవ్వడం లేదని అమాత్యుల దృష్టికి తీసుకెళ్తే పెద్దగా పట్టించుకోవడం లేదట. ఇప్పటివరకు నాలుగు గోడల మధ్య వ్యక్తం చేస్తున్న వాళ్ల గోడే..సీక్రెట్ మీటింగ్ వరకు వెళ్ళిందన్న చర్చ బలంగా వినిపిస్తుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఒక యువ ఎమ్మెల్యే..కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటీని ఆర్గనైజ్ చేశారట. సదరు ఎమ్మెల్యే తన ఫామ్‌హౌస్‌లో డిన్నర్ ఏర్పాటు చేసి సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను ఆహ్వానించారట. దాదాపు పది మంది ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశానికి వెళ్లినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ భేటీలో ప్రధానంగా.. తమ ఎదురవుతున్న ఇబ్బందులపైనే చర్చించారట. డిన్నర్‌కు పిలిచిన ఎమ్మెల్యే మొదట తన నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు..అందుకు ఒకరిద్దరు మంత్రులు పెడుతున్న ఇబ్బందులను ప్రస్తావించారట. ఒక కీలక మంత్రి తనను సతాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారట. డిన్నర్‌కు అటెండ్ అయిన మిగత ఎమ్మెల్యేలు కూడా ఆయనతో కోరస్ కలిపారట. తమ పరిస్థితులను వివరించుకుంటూ గోడు వెళ్లబోసుకున్నారట. చాలామంది మంత్రులు అసలు ఎమ్మెల్యేలకు టైమ్ ఇవ్వడం లేదని సమావేశంలో చర్చించుకున్నారట. 11 మంది మంత్రులలో.. సగానికి పైగా మంత్రులు ఎమ్మెల్యేలకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారట. కొందరు మంత్రులు అయితే కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయట్లేదని ఫ్రస్ట్రేట్ అయ్యారట ఎమ్మెల్యేలు. కొందరు మినిస్టర్లు గంటలకొద్దీ బయట వెయిట్ చేయిస్తున్నారని..ఇంకొందరు మంత్రులు తమ నియోజకవర్గంలో వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తున్నారంటూ అగ్గిమీద గుగ్గిలం అయ్యారట ఎమ్మెల్యేలు. ఇలా ఎమ్మెల్యేల సమావేశం..డిన్నర్ భేటీ కాస్త..సీక్రెట్ మీటింగ్ అని ప్రచారం జరిగిందట. మంత్రుల తీరుపై ఇప్పటికే ఒకసారి ఫిర్యాదు చేసినా వారిలో ఏమాత్రం మార్పు రావడం లేదని ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారట. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మందలించినా మంత్రుల్లో మార్పు రావడం లేదట. అమాత్యులు తమ వ్యక్తిగత పనులపై ఫోకస్ పెట్టుకుంటే..పార్టీ తీవ్రంగా నష్టపోతుందని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అంతా భావిస్తున్నారట. ఈ పరిణామాలన్నింటినీ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారట. ఇదే విషయం బయటకు లీక్ అయిందంటున్నారు. కాస్త రహస్య సమావేశమని.. అటు కాంగ్రెస్‌లో..ఇటు తెలంగాణ పాలిటిక్స్‌లో హీట్ క్రియేట్ చేస్తోంది. ఇలా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రత్యేక డిన్నర్ భేటీ..తెలంగాణ పాలిటిక్స్ లో చర్చనీయాంశంగా మారింది. పైకి సీక్రెట్ మీటింగ్ లేదు..ఏమీ లేదని అంటున్నా దాల్ మే కుచ్ కాలా హై అన్న చర్చ అయితే జరుగుతోంది. నిజంగానే ఎమ్మెల్యేలు రహస్య భేటీ అయ్యారా లేక దీని వెనుక ఇంకేమైన మతలబు ఉందా అనేది వేచి చూడాలి మరి.

# కేసీఆర్ వైల్డ్ ఫైరేనా

**మెదక్ :** తెలంగాణ గట్టుపై సరికొత్త రాజకీయం. రోజుకో హాట్ టాపిక్. ఎన్నో పొలిటికల్ ఇష్యూస్. డెవలప్‌మెంట్ ఏదైనా రాజకీయమంతా ఆయన చుట్టే. విమర్శ అయినా..పొగడ్త అయినా..ఆయన మౌనంగా ఉన్నా..మాట్లాడినా..అన్నింటా గులాబీ దళపతి ప్రస్తావన ఉండాల్సిందే. సీఎం రేవంత్ సవాల్ చేసినా..మంత్రులు రెచ్చగొట్టినా సైలెంట్‌గా ఉంటూ.. ఇటు బీఆర్ఎస్ పార్టీలో అటు ప్రజల్లో..పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తిరేపుతూ వచ్చిన కేసీఆర్ ఎట్టకేలకు మౌనం వీడారు. ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో జహీరాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేసీఆర్ సమావేశం అయ్యారు. కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగిన గులాబీ బాస్..గంభీరంగా అన్నీ గమనిస్తున్నానని చెప్పారు. తాను కొడితే మాములుగా ఉండదంటూ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ శక్తి ఏందో కాంగ్రెస్ వాళ్లకు చూపించి మెడలు వంచుతామన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరన్న కేసీఆర్..కాంగ్రెస్ వాళ్లు దొరికితే ప్రజలు కొట్టేలా ఉన్నారని హాట్ కామెంట్స్ చేశారు. తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజలు మోసపోయి గోసపడుతున్నారని చెప్పారు. భూముల ధరలు అమాంతం పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేసిన గులాబీ బాస్.. ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలంటూ గులాబీ క్యాడర్‌కు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలాఖరున భారీ బహిరంగ సభ పెడుతున్నామని.. అందరూ తప్పకుండా రావాలన్నారు కేసీఆర్. కాంగ్రెస్‌పై అంతటా అసంతృప్తే ఉందన్న ఆయన.. రైతుబంధుకి రాంరాం, దళితబంధుకు జైభీం చెబుతారని ఆనాడే చెప్పానని గుర్తు చేశారు. మంచేదో చెడేదో ప్రజలకు తెలిసి వచ్చిందని..కైలాసం ఆడితే పాము మింగినట్లు అయిందని..కాంగ్రెస్ పాలనను ఉదహరించారు కేసీఆర్. మాట్లాడితే ఫామ్ హౌస్..ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారని..ఫామ్ హౌస్‌లో పంటలే ఉంటాయని చెప్పుకొచ్చారు గులాబీ బాస్. గులాబీ దళపతి మౌనం వీడటం ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. నాలుగు ప్రభుత్వ పథకాలు అమలుపై కన్ఫ్యూజన్..రైతు బంధు ఆలస్యంపై ప్రజల్లో అసంతృప్తి ఉన్న వేళ కేసీఆర్ సమరమే అంటూ ప్రకటించడం గులాబీ క్యాడర్‌లో జోష్ నింపుతోంది. అయితే ముందస్తు వ్యూహం ప్రకారమే ఫిబ్రవరి నుంచి ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నారట కేసీఆర్. సంక్రాంతి పీడ దినాలు అయిపోయాక జనవరి 15 తర్వాత ఫీల్డ్‌లోకి దిగాలని భావించారు కేసీఆర్. ఇంకాస్త టైమ్ ఇచ్చి ఇప్పుడు ఫిబ్రవరిలో భారీ బహిరంగ సభ పెడతామంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది సమయం



ఇవ్వాలని భావించే కేసీఆర్..ఇప్పటివరకు ఆగారని..ఇక ఫుల్ టైమ్ పబ్లిక్‌లోనే ఉండేలా ప్లాన్ చేస్తున్నారని చెప్తున్నారు గులాబీ నేతలు. కాంగ్రెస్ వైఫల్యాల మీద సమరభేరి పూరిస్తామంటున్నారు. భారీ పబ్లిక్ మీటింగ్ పెట్టి రేవంత్ సర్కార్ ఫెయిల్యూర్స్‌ను ఎండగడతామని..ఇక జనంలోనే ఉంటామని చెప్పుకొస్తున్నారు. కేటీఆర్, హరీశ్‌రావు.. ప్రభుత్వంపై పోరాడుతూ ఫుల్ యాక్టివ్‌గానే ఉన్నప్పటికీ, కేసీఆర్ మీడియాలో కనిపించని లోటు మాత్రం స్పష్టంగా కనిపిస్తోందని..అటు ప్రజలు, ఇటు రాజకీయ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ మౌనం వీడటం ఆసక్తిని రేపుతోంది. ఈ మధ్యే కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలన..సీఎం రేవంత్‌పై పబ్లిక్ ఒపీనియన్ ఏంటో తెలుసుకునేందుకు కేసీఆర్ ఓ సర్వే చేయించినట్లు వార్తలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో 10శాతం ఓట్లు తగ్గాయని కేసీఆర్ చేయించిన సర్వేలో తేలిందట. ఆ సర్వే రిపోర్టుకు తగ్గట్లుగానే ప్రస్తుత పరిస్థితులు కూడా ఉన్నాయని..తాను పొలిటికల్ పిచ్‌లోకి దిగడానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట గులాబీ బాస్. ఇప్పటికే ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వస్తోంది బీఆర్ఎస్. రైతు ధర్నాల్లో కేటీఆర్..కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ఏడాది పాలన అయిపోవడంతో..ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ భారీ సభ పెట్టబోతున్నారట. ప్రత్యేకంగా పాటలు కూడా సిద్ధం చేయిస్తున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక బృందం పాటల రూపకల్పనలో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు.. వాటి అమలు, ప్రభుత్వం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్లాన్ రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యమ సమయంలో మాదిరిగానే ఇప్పుడు కూడా సాంస్కృతిక బృందాలతో ప్రత్యేకంగా వీడియోలు రూపొందించే పనిలో గులాబీ నేతలు ఉన్నట్లు చెబుతున్నారు. షార్ట్ ఫిలిమ్స్ రూపొందించి ప్రభుత్వం ఏయే రంగాల్లో విఫలమైందో వివరించే ప్రయత్నం చేస్తున్నారట. బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ రంగం ఎలా ఉండే..ఇప్పుడెలా ఉంది? ఐటీ పరిస్థితి ఏంటి? ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉంది? రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లో ప్రభుత్వ వైఫల్యాలు ఎలా ఉన్నాయి.. ఇలా అన్ని అంశాలు ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయబోతున్నారట. అందుకోసం ఇప్పటికే అంతా సిద్ధం చేసి పెట్టినట్లు సమాచారం. ఫిబ్రవరిలో భారీ బహిరంగ సభతో కేసీఆర్ ప్రజల ముందుకు వచ్చి..ఆ తర్వాత జిల్లాల పర్యటనలు వెళ్లే అవకాశం ఉందన్న టాక్ కూడా వినిపిస్తోంది. సరైన టైమ్ చూసి ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తాలని కేసీఆర్ భావిస్తున్నారని..ఇప్పుడు జనాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని దాన్ని క్యాచ్ చేసుకోవాలని అనుకుంటున్నారని తెలుస్తోంది. చూడాలి మరి గులాబీ బాస్ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయో.

# ఏప్రిల్ ఫస్ట్ నుంచి భారీగా పెరగనున్న భూములు

**హైదరాబాద్ :** తెలంగాణలో భూములు కొనాలనుకునేవారికి బిగ్ షాక్ తగలనుంది. మరికొన్ని రోజుల్లో భూముల విలువలు మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తాజాగా పలు నివేదికల ఆధారంగా మార్కెట్ విలువల్లో భారీ వ్యత్యాసాలున్నట్లు గుర్తించిన సర్కార్.. పలు సవరణ ప్రతిపాదనలు రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగ మార్కెట్, రిజిస్ట్రేషన్ శాఖ పుస్తక విలువలకు చాలా తేడా ఉండటంతో భూములు, ఆస్తుల విలువలను హేతుబద్ధీకరించాలని నిర్ణయించినట్లు సమాచారం. భూముల విలువను 100 నుంచి 400 శాతం వరకు పెంచేందుకు ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇక ఏప్రిల్ 1 నుంచి కొత్త మార్కెట్ విలువలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుందట. ప్రతి సంవత్సరం శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువ పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారట. దీతో రాష్ట్రంలో 6ఏళ్ల తర్వాత భూముల విలువలు పెంచడానికి రంగం సిద్ధంచేయగా.. ఆయా ప్రాంతాలను బట్టి 15-30 శాతం ఫ్లాట్లు, స్థలాల విలువను 4 రెట్లు పెంచే అవకాశం ఉంది. అయితే భూముల వాల్యూ అమాంతం పెరిగితే రియల్‌ఎస్టేట్ రంగం నష్టపోయే అవకాశం కూడా ఉండటంతో శాస్త్రీయంగా పద్ధతిలో మదింపు చేసి, విలువ పెంచాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారట. ప్రస్తుతం చదరపు అడుగు ఫ్లాట్ ధర రిజిస్ట్రేషన్ నగరాల్లో రూ.3200 ఉంది. అయితే దీనిని 60 శాతానికి మించకుండా రూ.5120 వరకు మాత్రమే పెంచాలని యోచిస్తోంది. హైదరాబాద్ లోని కొండాపూర్, గచ్చిబౌలిలో రిజిస్ట్రేషన్ శాఖ విలువ గజానికి రూ.26700గా ఉండగా.. కమర్షియల్ స్థలానికి రూ.44900 ఉంది. బుద్వేల్‌లో ఎకరా రూ.20 కోట్లు వరకు పలకగా.. మహేశ్వరంలో గజం రూ.2100 ఉంది. ఇక కమర్షియల్ స్థలం రూ.10,200 ఉంది. నార్సింగ్‌లో రూ.23800, రాయదుర్గంలో రూ.44900, బుద్వేల్‌లో రూ.10200, మణికొండలో రూ.23900గా కేటాయించారు. మహేశ్వరం లాంటి చోట్ల రూ.2100 ఉన్న విలువను 400 శాతం పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. వ్యవసాయ భూములు, స్థలాలకు ప్రస్తుత విలువను సవరించి 200 శాతం పెంచనున్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో గజం ధర రూ.1000 ఉంటే దాన్ని రూ.3 వేల వరకు పెంచాలనే ప్రతిపాదనలున్నట్లు సమాచారం. 2023-24 రిజిస్ట్రేషన్ శాఖకు 14,588 కోట్ల ఆదాయం వచ్చింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్ల రాబడి వస్తుందని భావిస్తున్నారు. ఫ్లాట్ల నుంచి 35.1 శాతం అంటే రూ.5,115 కోట్లు సమకూరుతోంది. ప్లాట్ల నుంచి 22.8 అంటే రూ.3322 కోట్లు. ఇళ్ల రిజిస్ట్రేషన్ల ద్వారా 19.5 అంటే రూ.2838 కోట్లు.

## ప్రతి ఒక్కరికీ విద్యా అందాలి

-మొదటిపేజీ తరువాయి



సరస్వతి అమ్మవారిని మంత్రి పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... తెలంగాణలో ప్రతి ఒక్క బిడ్డ ఉన్నత విద్యావంతుడై తెలంగాణ అభివృద్ధితో పాటుగా దేశంలో కూడా అన్ని రంగాల్లో ముందు ఉండాలని అమ్మవారి కటాక్షం ఉండాలని కోరుకున్నానని చెప్పారు. తల్లిదండ్రులు మీరు ఒక పూట శ్రమపడ్డ పిల్లలను చదివించడానికి శ్రద్ధ వహించాలని అన్నారు. ఏ ఆస్తి అన్న ఎప్పుడైనా పోవచ్చు కాని విద్యాకు సంభందించిన ఆస్తి ఎప్పుడు పోదని చెప్పుకొచ్చారు. తెలంగాణలో అటు బాసర ఇటు వర్గల్ సరస్వతి అమ్మవారి ఆలయాలు మన ప్రాంతంలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం తరపున దేవాలయాల అభివృద్ధికి కానీ దేవాలయాలకు సంబంధించిన విద్యాలయాలకు అభివృద్ధికి సంభందించిన విషయంలో అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను బాలకార్మికులుగా చేర్చే ప్రయత్నం చేయొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

**వివరాలు ఇవ్వలేదు..**

ప్రధాన రాజకీయ పార్టీ పెద్దలు కులగణనలో వివరాలు ఇవ్వలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కల్వకుంట్ల ఫ్యామిలీలో ఎమ్మెల్సీ కవిత తప్పా ఎవరూ వివరాలు ఇవ్వలేదని చెప్పారు. సర్వే కోసం వెళ్లిన వాళ్లపైకి కుక్కలను వదిలిన వారూ ఉన్నారని అన్నారు. సహాయ నిరాకరణ లాగా కొందరు కావాలని వివరాలు ఇవ్వలేదని చెప్పారు. కులగణనపై అన్ని రాజకీయ పార్టీలు తమ స్టాండ్ ఏంటో తెలియజేయాలని చెప్పారు. గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బలహీన వర్గాల కోసం రేపు అసెంబ్లీలో అన్ని పార్టీలు తమ వాదన వినిపించాలని అన్నారు.

**కులగణన అడ్డుకుంటే ఊరుకునేది లేదు..**

కులగణన ఒక ఉద్యమం లాగా చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఎవరు ఎంత అనే లెక్క తేలిందన్నారు. క్యాబినెట్ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. కులగణన చేస్తామని మాట ఇచ్చాం. చేసి చూపించామన్నారు. కులగణన అడ్డుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కులగణన కోసం పోరాటం చేసిన వారందరిని ప్రశంసించారు. ప్రభుత్వం నిర్ణయం నుంచి నివేదిక దాకా కులగణన ప్రక్రియలో భాగం అయినందుకు గర్వంగా ఉందన్నారు. బీసీ సోదరులందరూ రేపు ఉత్సవాలు జరపాలని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రేపు అసెంబ్లీకు రావాలని కోరారు. బీసీలకు న్యాయం జరగాలని కోరుకుంటే కేసీఆర్ రేపు అసెంబ్లీకి వస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## ఈనెల 15లోపు పంచాయతీ ఎన్నికల షెడ్యూల్



-మొదటిపేజీ తరువాయి

మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిత్యం ప్రజల్లో ఉండాలని.. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సర్పంచ్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పంచాయతీ ఎన్నికల కోసం క్యాడర్‌ను సమాయత్తం చేస్తోంది హస్తం పార్టీ. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలను అప్రమత్తం చేస్తోంది. గ్రామాల్లోని పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు రానివాళ్లు ఆందోళన చెందవద్దని మంత్రి సూచించారు. సంక్షేమ పథకాలకు లబ్దిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని తెలిపిన మంత్రి.. అందరికీ న్యాయం చేయడమే కాంగ్రెస్ బాధ్యత అన్నారు. ఇదిలావుంటే, కులగణనపై నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే అందింది. ఫిబ్రవరి 4వ తేదీన ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. ఆ తర్వాత రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకుని, ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి తొలి వారంలో ఎన్నికలను నిర్వహించాలని రేవంత్ రెట్టి ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

## తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టులు



-మొదటిపేజీ తరువాయి

ప్రతి 150 కి.మీ ఎయిర్‌పోర్టులు ఉంటే తెలంగాణలో మాత్రం అందుబాటులో లేవని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మేరకు వరంగల్ మామునూరు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టులు నిర్మించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరుకు కేంద్రానికి ప్రతిపాదనలు సైతం పంపించారు. తాజాగా.. తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. తాజా కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా... 120 కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని నాలుగు ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. ప్రస్తుతం వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టుకు 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మరికొంత భూమి అవసరమని ౦౦ఎ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో 253 ఎకరాలను ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అదనంగా కేటాయింలు చేసింది. ఇక్కడ బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అడుగులు పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కూడా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇక్కడ కూడా ప్రభుత్వ భూములు భారీగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించనుండగా.. ఏఏఐ బృందం ఇప్పటికే ఫీజిబిలిటీ పరీక్షలను నిర్వహించింది. కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేస్తామని తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో వరంగల్ మామునూరు, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ఈ ఏడాదిలోనే అడుగులు పడనున్నాయి.

## సంపాదకీయం

# సామూహిక మరణాలను ఆపాల్సిందే

సంగం నోస్ వద్ద వేర్వేరుగా వచ్చి గంగా, యమునా నదీ ప్రవాహాలు ఒక్కటిగా కలిసిపోయి ముందుకుసాగడం చూడొచ్చు. ఇక్కడ రెండు నదులు వేరువేరు రంగులలో కనిపిస్తాయి. యమునా నదీజలాలు లేత నీలం రంగులో, గంగాజలం కొద్దిగా బురదమయంగా కనిపిస్తుంది. యమునా నది ఇక్కడ గంగానదిలో కలిసి అంతర్ధానమవుతుంది. అంతర్వాహినిగా సరస్వతి నది సైతం సంగమించే ఈ ప్రాంతాన్నే కుంభమేళాలోని ప్రధాన సంగం ఘాట్‌గా చాలా మంది భావిస్తారు. వివిధ సంప్రదాయాలకు చెందిన అఖాడా సాధువులు తమ ఆచారాలు, అమృత స్నానాలను సంగం నోస్ వద్దే ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. శతాబ్దాల క్రితం జనాభా తక్కువ. అందులోనూ ఈ స్థాయిలో భక్తజనకోటి లేదు. కాబట్టి ఆనాడు కుంభమేళాకు విచ్చేసిన భక్తులంతా కేవలం ఈ త్రివేణి సంగమ స్థలి వద్దే పవిత్ర స్నానాలు ఆచరించేవారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము కూడా ఈ సంగం నోస్ వద్దే పుణ్యస్నానాలు ఆచరించాలని ఈ విషయం తెల్సిన చాలా మంది భక్తులు భావిస్తారు. వాస్తవానికి 4,000 హెక్టార్లలో విస్తరించిన ఘాట్‌లలో సంగం నోస్ కూడా ఒకటి. సంగం నోస్ వద్ద ఎక్కువ మంది స్నానాలు ఆచరించడానికి వీలుపడదు. కానీ జనం ఇక్కడే ఎక్కువగా స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒడ్డు వెంట ఇసుక బస్తాలు వేసి, డ్రెడ్జింగ్ చేసి ఎక్కువ మంది కొనదాకా వచ్చి స్నానాలు చేసేలా దీనిని పెద్ద ఘాట్‌గా మార్చారు.కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి రావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు మృతిచెందంతో పాటుగా 60 మంది గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి.గతంలో కూడా కుంభమేళాతో పాటుగా పర్వదినాలు, ఆధ్యాత్మిక సమ్మేళనాల సందర్భంగా ఇలాంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి.వందలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే వేడుకల ఏర్పాట్లలో పాలకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటనలు గుర్తు చేస్తున్నాయి. భక్తులు సైతం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఇవి నొక్కి చెప్తున్నాయి. వదంతులు, భక్తుల్లో భయాలు, తామే ముందుండాలనే తొందరపాటు కారణంగా జరిగే తోపులాటలే ఎక్కువగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి.గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్లముందు మెదలుతూ ఉంది. బాబా పాదధూళి కోసం భక్తులు ఎగబడ్డంతో జరిగిన ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారిలో అత్యధికులు మహిళలే.మొన్నటికి మొన్న తిరుమల వెంకన్న సన్నిధిలో ముక్కోటి దర్శనం టోకెన్ల కోసం భక్తులు ఒక్కసారిగా ఎగబడ్డంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, 40 మంది గాయపడ్డారు. ఇలాంటి దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలే ఉంటుండడం గమనార్హం.మహిళలు ఆందోళనకు గురికావడం లేదా కిందపడిపోవడం, తల్లుల చేతుల్లో లేదా వెంట ఉండే చిన్నారులు కూడా వారితో పాటే ఊపిరాడక చనిపోవడమే ప్రధాన కారణం. 2005లో మహారాష్ట్రలోని మంధర దేవి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వెళ్లడం, ఆలయమెట్లపైనుంచి జారి భక్తులు ఒకరిపై మరొకరు పడ్డంతో 340 మంది ప్రాణాలు కోల్పోయారు. 2008లో హిమాచల్‌ప్రదేశ్‌లో నైనాదేవి ఆలయంలో జరిగిన తోపులాటలో 162 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారు. కొండచరియలు విరిగిపడుతున్నాయన్న వదంతులే ఈ ప్రమాదానికి కారణం. 2008లో రాజస్థాన్‌లోని చాముండేశ్వరీ దేవి ఆలయంలో, 2013లో నవరాత్రుల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని రత్నగఢ్ మందిరంలో జరిగిన తొక్కిసలాటలోనూ వందల ప్రాణాలు గాలిలో కలిసిపోవడానికీ ఇలాంటి వదంతులే కారణం.ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ఘటనాస్థలంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉంటాయి. సాయం కోసం క్షతగాత్రులు చేసే ఆక్రందనలు, భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదరుగా పడిపోవడమే కాకుండా ఒక్కోసారి డబ్బు, విలువైన వస్తువులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి.కాగా మౌని అమావాస్య నాడు పవిత్ర స్నానాలకు పదికోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు ముందునుంచీ చెబుతున్నా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు మాత్రం చేయకపోవడమే తొక్కిసలాటకు కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ తొక్కిసలాట జరిగింది.వెలుతురు సరిగా లేకపోవడం, తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోవడం వారిపైనుంచి జనం నడుచుకు పోవడంతో ఎక్కువ మంది చనిపో వడమో, గాయపడ్డమో జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన అన్ని తొక్కిసలాట ఘటనలకూ దాదాపుగా ఇలాంటివే కారణాలు కావడం గమనార్హం.గతంలో పోలిస్తే ఇప్పుడు ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలకు భక్తుల రాక పెరిగింది. ప్రత్యేక రవాణా సదుపాయాలు, నిర్వాహకులు, ప్రసార మాధ్యమాలు చేసే ప్రచారం ఇందుకు ప్రధా న కారణం. వేదభూమి అయిన భారత దేశంలో అధ్యాత్మిక చైతన్యం మంచిదే కానీ ప్రాణంకన్నా ఏదీ ఎక్కువ కాదనే విషయాన్ని భక్తులు సైతం గుర్తుంచుకోవాలి.వీఐపీలకన్నా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తే ఎంత రద్దీనైనా అదుపు చేయవచ్చనే విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తులోనైనా ఇలాంటి సామూహిక మరణాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

# మన చదువులో తెలుగు వెలిగేదెలా



ఇదివరకటి తరాలతో పోలిస్తే ఈ తరంలో సాహిత్యం పట్ల ఆసక్తి కాస్త తక్కువే. కాలంతో పాటు మార్పు వస్తుంది, అంగీకరించక తప్పదు. ఈ మార్పులకు అనుగుణంగా సాహిత్యాన్ని తర్వాతి తరాలకు అందించడంలో మన కర్తవ్యం ఏమిటనేదే పునరాలోచించుకోవాలి. పాఠకులను తయారు చేసుకోవడంలో రెండు, మూడు తరాలను కోల్పోయాం. 10వ తరగతి లోపు 2000 రోజులు పాఠశాలలో గడిపిన పిల్లల్లో 2, 3 శాతానికి కూడా సాహిత్యం పట్ల ఆసక్తి కలగడం లేదు. సాహిత్యాన్ని వ్యక్తిగత ఇష్టంతో చదవడం లేదు. ఎక్కువ మంది ఉపాధ్యాయులు పిల్లలకు సాహిత్యాన్ని చేరవేయడంలో విజయం సాధించలేదు. సిలబస్ పూర్తిచేసే పనిలో మాత్రమే వాళ్లున్నారు. అందువల్ల పాఠశాల స్థాయిలోనే చాలావరకు సాహిత్యం పట్ల ఆసక్తి లేకుండా పోతున్నది. ప్రైవేట్ పాఠశాలల సంగతి చెప్పవలసిన అవసరం లేదు. తెలుగంటే వాళ్లకి అంటరానిది. మరి ఇంగ్లీషులో ఏమైనా సాహిత్య విలువలు ఉన్నాయా అంటే అది కూడా సున్నా. ఇంగ్లీషులో నాలుగు సృజనాత్మక వాక్యాలు రాయమన్నా వారు నోరు వెళ్లబెట్టాల్సిందే. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా పిల్లలకు సాహిత్యపు విలువలను, ఆసక్తిని కలిగించడంలో పూర్తిగా విఫలమైనట్టుగా తెలుస్తున్నది. ఇక డిగ్రీ స్థాయికి వచ్చేసరికి విద్యార్థులకు సమాజం పట్ల, సమూహం పట్ల ఒక అవగాహన ఏర్పడి ఉంటుంది. అక్కడ కూడా తెలుగు పాఠం మాత్రమే చెప్తున్నారు కానీ, సాహిత్యం ఏం చేస్తుందో, సాహిత్యంతో పాటు మనం ఎందుకు నడవాలో, మంచి పుస్తకాలు మనుషులను ఏం చేస్తాయో ఇట్లాంటి విషయాలను చేరవేయడంలో మన విద్యావిధానం సరైన మార్గంలో వెళ్లడం లేదని చెప్పవచ్చు. ఇట్లాంటి సందర్భంలో సాహిత్యాన్ని యువత వద్దకు లేదా పాఠశాల స్థాయికి తీసుకువెళ్లాలంటే రచయితలుగా మనం ఏం చేయాలో ఆలోచించుకోవాలి. ఇప్పటికే అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో మనం ఉన్నాం. తెలుగు భాషకు సంబంధించి రాత విషయంలో పిల్లలు దారుణంగా వెనుకబడి ఉన్నారు. సొంతంగా పది వాక్యాలు కూడా రాయలేని తరం ఒకటి ఇప్పుడు నడుస్తున్నది. హైస్కూల్ స్థాయి పిల్లలకు అమ్మ గొప్పతనం గురించి, నాన్న గురించి పది వాక్యాలు రాయమని చూడండి, వాళ్లు ఎట్లాంటి స్థాయిలో ఉన్నారో అర్థమవుతుంది. ఉపన్యాస పోటీలు నిర్వహించండి కనీసం ముగ్గురు, నలుగురు వచ్చి నిలబడి మాట్లాడే పరిస్థితుల్లో ఉండరు. విద్యార్థుల ముందు నిలబడి పాఠం చెప్పే ఉపాధ్యాయులను రచయితలు చేరాలి. మండల కేంద్రాల్లోనూ, జిల్లా కేంద్రాల్లోనూ బతిమిలాడో, బలవంతంగానో అప్పుడప్పుడు సాహిత్య సమావేశాలు జరిపి ఉపాధ్యాయులను ఆహ్వానించి సాహిత్యాన్ని పిల్లలకు చేరవేయాలని చెప్పక తప్పదు. మా ఆదివారాన్ని నాశనం చేస్తారా అని ఉపాధ్యాయులు అడగవచ్చు. నెలలో ఒక్క ఆదివారం మన కోసం, మన భాష కోసం, మన పిల్లల కోసం అని చెప్పి ఒప్పించగలగాలి. వీలైతే అందులో 10 శాతం ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లిన తర్వాత పిల్లల ముందు కచ్చితంగా ప్రయత్నం చేస్తారు. అలాగే జూనియర్, డిగ్రీ కళాశాలలు. ఇట్లా ముందు అధ్యాపకులను మనం చేరగలిగితే ఏమైనా మార్పు వస్తుందేమో చూడాలి. సాహిత్యం అంటే తెలుగు ఉపాధ్యాయుడి పని అనే అపోహను తొలగించగలగాలి. మనకు దగ్గరలో ఉన్న పాఠశాలలను, గురుకుల పాఠశాలలను, కస్తూర్బా పాఠశాలలను బృందాలుగా దర్శించాలి. అప్పుడప్పుడు చిన్న చిన్న వర్క్ షాపులు నిర్వహించుకోవాలి. ఇట్లాంటి కార్యాచరణను రూపొందించుకోవడానికి ముందు రచయితలు అంతా ఏకం కావాలి. మనం ఏ దృక్పథానికి చెందిన రచయిత అయినా పర్లేదు, ముందు సాహిత్యం పట్ల ఆసక్తిని, దాని విలువను తెలియజేయాల్సిన అవసరం ఉన్నది.

ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం, సాహిత్యాన్ని తర్వాతి తరానికి అందించడమని నమ్మేవాళ్లు ఏకం కావాలి. రచయితలంతా ఏకమై తరచుగా విద్యాలయాలను సందర్శించడం, కనీసం బతిమాలైనా ఒక గంట పాటు అరువు తీసుకోవడం, ఆ గంటను చైతన్యవంతంగా, సమర్థవంతంగా వినియోగించుకోవడం పట్ల ఆలోచించాలి. ఉపాధ్యాయులను బృందాలుగా కలుపుకొని సాహిత్యాన్ని ఒక ఐదు నిమిషాలు పాఠశాలలో పరిచయం చేయమని బతిమిలాడాలి. వర్సిటీల్లో పీజీ స్థాయి విద్యార్థులుంటారు. వాళ్లకు కనీసం నెలకు ఒక సాహిత్య కార్యక్రమాన్ని ఏర్పాటుచేయాలి. ఇతిహాసాల నుంచి సమకాలీన సాహిత్యం వరకు ఏదో ఒక అంశాన్ని ఇచ్చి వాళ్ల చేత రెండు మూడు నిమిషాలు మాట్లాడించవచ్చు. ఆ నెపంతో వాళ్లు కొన్ని పుస్తకాలను తిరగేస్తారు. విశ్వవిద్యాలయ గ్రంథాలయాలను సందర్శిస్తారు. అక్కడే ఉండే పీజీ విద్యార్థులు, పరిశోధకులతో చిన్న వర్క్‌షాప్ సెమినార్లు ఏర్పాటు చేయవచ్చు. అయితే విశ్వవిద్యాలయంలో కూడా సమస్యలు లేకపోలేదు. అన్ని విశ్వవిద్యాలయాలలోను నియామకాలు లేవు. ఆయా విభాగాలలోని అధ్యాపకులకు కూడా హెచ్చు తగ్గు భేదాలు, ఒకరంటే ఒకరికి పడకపోవడాలు లాంటివి ఉన్నాయి. ఏది ఏమైనప్పటికీ సాహిత్యాన్ని యువత దగ్గరికి తీసుకెళ్లడంలో మనం సరైన మార్గం లో వెళ్లకపోవడం కారణంగా సాహిత్యంలో సృజనాత్మకతతో కూడిన ఆలోచనలు తక్కువ అయ్యా యి. పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ముందు తరం రచయితలు ఈతరం రచయితలతో ముఖాముఖి ఏర్పాటు చేయవచ్చు. కవిత్వ భాషా పుస్తకంలో బొల్లోజు బాబా చెప్పినట్టు సాహిత్యం చేసే పని చదివితే వచ్చే మార్కుల్లాగా కనిపించదు.

అందులో ప్రోగ్రెస్ కార్డులు ఉండవు. కానీ సాహిత్యం అంతః సంస్కారం అనే విషయం కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలోత్సవ పేరు మీద ఒకటి రెండు రోజులు కార్యశాలలు జరుగుతున్నప్పటికీ అవి ఎంత మాత్రం కొనసాగింపుగా ఉన్నాయో పరిశీలించుకోవాలి. ప్రైవేటు పాఠశాలల్లో , ప్రభుత్వ పాఠశాలల్లో భాషోపాధ్యాయుడు, విద్యార్థులతో సారస్వత సంఘాలు ఏర్పాటు చేయాలి. చెట్టు, వర్షం, సముద్రం, ఆకాశం, మంచి స్నేహితుడు ఇట్లాంటి చిన్న చిన్న అంశాలు ఇచ్చి విద్యార్థుల చేత మాట్లాడించాలి. అక్కడ కొంతమంది కవుల రచనలను చదివి వినిపించగలగాలి. పాఠశాల స్థాయి సాహిత్యపు రుచిని నుంచి చూపించాలి. తెలుగు సాహిత్యం చదువుకున్న వాళ్లకు ఓటీటీ వేదికలుగా అపారమైన అవకాశాలున్నాయి. మీడియాలో అవకాశాలున్నాయి. అయితే వాళ్లు కనీసం నాలుగైదు పేజీలు వ్యాసం రాయగలగాలి. అనువాదాల మీద దృష్టి పెట్టాలి. సృజనాత్మకత గల రచనకు ప్రాతిపదికగా అంతకుముందున్న రచనలు పనికొస్తాయనే విషయాన్ని తెలియజేయాలి. తెలుగు సాహిత్యాన్ని చదివితే ఎట్లాంటి అవకాశాలున్నాయో వాళ్లకు తెలియజేయాలి. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఒక కథ చెప్పి తరగతి గదిలో చర్చలు మొదలుపెట్టవచ్చు. ఒక కవిత వినిపించి దాన్ని వారికెలా అర్థమైందో చెప్పమని అడగవచ్చు. తెలిసిన దాన్నుంచి పిల్లలను తెలియనిదానికి తీసుకువెళ్లి వదలాలి. ఇవాళ అన్ని స్థాయి ల్లోనూ ఒక నిర్లిప్తత కొనసాగుతున్నది. మార్కులు సంపాదించే విషయం భాష కాదు. పాఠ్య పుస్తకాల్లోని పాఠాలతో భాషను నేర్పించలేం. అది కేవలం కొంత తోడ్పాటు మాత్రమే.

# పోల్ అడ్డం తిరిగింది




సోషల్ మీడియాలో కాంగ్రెస్‌కు ఘోరమైన ఎదురుదెబ్బ తగిలింది. ఎవరి పాలన కావాలంటూ కాంగ్రెస్ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో పెట్టిన పోల్‌లో దాదాపు 70 శాతం మంది ప్రజలు కేసీఆర్ పాలన బాగుందని ఓట్లు వేశారు. కాంగ్రెస్ పార్టీకి ఇది ఊహించని ఎదురుదెబ్బ. తన అధికారిక ట్విట్టర్‌లో ఇలాంటి ఫలితాలు రావడం ఆ పార్టీకి రెడ్ సిగ్నలే. ఇప్పుడీ పోల్ తెలంగాణ పొలిటికల్ సర్కిళ్లలో హాట్ టాపిక్ అయింది. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఎంతటి అసంతృప్తి, ఆగ్రహం ఉందో తాజా పోల్ నిరూపించింది. 'కాంగ్రెస్ పాలన వద్దు, కేసీఆర్ పాలన ముద్దు' అని ప్రజలు నిర్మొహమాటంగా చెప్పేశారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని ఎంత బలంగా కోరుకుంటున్నారో తమ ఓటుతో తెలియజెప్పారు. నిజానికి 420 హామీలపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ వేసిన ట్రాప్‌లో కాంగ్రెస్ చిక్కుకుంది. కాంగ్రెస్ హామీలపై గులాబీ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టింది. అయితే, బీఆర్ఎస్‌ను ప్రజల్లో బద్నాం చేసేందుకు కాంగ్రెస్ సోషల్ మీడియా ముందు రోజే అంటే జనవరి 29న తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో పోల్ పెట్టింది. 'ఫామ్ హౌస్ పాలన కావాలా?ప్రజల వద్దకు పాలన కావాలా?' అని పోస్ట్ పెట్టింది. ప్రభుత్వానికి పాజిటివ్‌గా తీర్పు వస్తే తన అనుకూల మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తూ బీఆర్ఎస్‌పై మరింతగా రెచ్చిపోవచ్చునని భావించింది. బీఆర్ఎస్ ప్రోగ్రాం అట్టర్ ఫ్లాప్ అయిందని, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మడం లేదని ప్రచారం చేయవచ్చని కలలు కన్నది. అయితే కాంగ్రెస్‌వి పగటి కలలే అయ్యాయి. ప్రజలు ఇచ్చిన దిమ్మతిరిగే షాక్‌తో ప్రభుత్వానికి పట్టపగలే చుక్కలు కనిపించాయి. అంతేకాదు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్‌రెడ్డి పాలనను సొంత పార్టీ నేతలు, కార్యకర్తలే వ్యతిరేకిస్తున్నట్టు తాజా పోల్ రిజల్ట్ స్పష్టం చేసింది. ప్రభుత్వ పనితీరుపై కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా పెట్టిన పోస్టులో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సొంత క్యాడరే ఓటు వేశారు. దీనిని బట్టి అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. సొంత పార్టీలో ఇంత అసంతృప్తి ఉంటే ఇక ప్రజల్లో ఉన్న అసంతృప్తి గురించి చెప్పనక్కర్లేదు. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వారిపై కేసులు పెడుతుండటాన్ని గ్రహించిన ప్రజలు బాహాటంగా రేవంత్‌ను విమర్శించే సాహసం చేయలేకపోతున్నారు. దీంతో అందివచ్చిన అవకాశంలా భావించి సోషల్ మీడియాలో కాంగ్రెస్ పెట్టిన పోల్ ద్వారా ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ పని అయిపోయిందని, కారు షెడ్‌కు పోయిందని, బీఆర్ఎస్ మునిగిపోయే పడవ అని విమర్శించే కాంగ్రెస్, బీజేపీకి ఈ రిజల్ట్ చెంపపెట్టులాంటిది. తెలంగాణ ప్రజలతో బీఆర్ఎస్ బంధం ఎంతలా పెనవేసుకుపోయిందో చెప్పేందుకు ఈ ఫలితం ఒక ఉదాహరణ. పోల్‌లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు విశ్వసించడం ఆ పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చినట్టు అయింది. సోషల్ మీడియాలో ప్రజలు తమకు అనుకూలంగా ఇచ్చిన తీర్పుతో బీఆర్ఎస్‌కు వేయి ఏనుగుల బలం వచ్చినట్టు అయింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు మరింతమంది నేతలు సిద్ధంగా ఉన్నారన్న టీపీసీసీ చీఫ్‌కు కూడా ఈ రిజల్ట్‌తో గట్టి షాక్ ఇచ్చారు. బీఆర్ఎస్‌పై కూడబలుక్కుని తప్పుడు ప్రచారం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌కు ఈ తీర్పు ఒక చెంపపెట్టులాంటిదే. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేనంత బలహీన పడిందని బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు ఇది జీర్ణించుకోలేని వార్త. కీలకమైన సర్పంచ్ ఎన్నికల వేళ ప్రజలు ఇలాంటి తీర్పు ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత చర్చలు మొదలయ్యాయి. ఎన్నికల్లో కనీసం పరువు అయినా నిలుస్తుందా? అని ఆందోళన చెందుతున్నారు. ప్రతిపక్షాన్ని ఇరుకులో పెట్టబోయి కాంగ్రెస్ తానే నవ్వుల పాలైంది. ప్రభుత్వంపై ప్రజల్లో ఇంత వ్యతిరేకతను కాంగ్రెస్ ఊహించలేకపోయింది. మరోవైపు సోషల్ మీడియాలో జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా వేల సంఖ్యలో ఫేక్ అకౌంట్లు క్రియేట్ చేసి ప్రభుత్వానికి అనుకూలంగా ఓట్లు వేయిం చే ప్రయత్నాలు చేస్తున్నది. తాజా పోల్ ఫలితాలతో పార్టీ మారాలనుకున్న చిన్నాచితక నేతలు సందిగ్ధంలో పడిపోయారు. ఈ నేపథ్యంలో ఇకపై రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నది. అధికార పార్టీ నుంచి నేతలు వలస వెళ్లినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. సొంత పార్టీలో, ప్రభుత్వంలో తిరుగుబాటు వచ్చినా రావచ్చు. ఇప్పటికే ఢిల్లీలో భట్టి, ఉత్తమ్ వంటి నేతలు పావులు కదుపుతున్నారు. ఇంకోవైపు ఇది ప్రతిపక్షానికి ప్రజలు ఇచ్చిన మద్దతు. ఏడాది కాలంగా ప్రతి పక్షం ప్రజల పక్షాన పోరాడుతున్న తీరుకు ఇది ఒక సమర్థన. ఈ తీర్పు ప్రతిపక్షంపై మరింత బాధ్యత పెట్టింది. బరువును పెంచింది.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు

### ఎంపీ, ఎమ్మెల్యేలు మౌనం పాటించడం సిగ్గు చేటు



**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు నిధులు కేటాయించనందుకు నిరసనగా, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు సోమ వారం ఇచ్చోడ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్ర హానికి వినతి పత్రాన్ని సమర్పించారు. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పలు అంశాలను కూడా పట్టించుకోకపోవడం ఎంత వరకు సమంజస మని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకే కేంద్రం బడ్జెట్ లో అధిక ప్రాధాన్యత ఇచ్చిందని వారు దుయ్యబట్టారు. పెండింగ్ లో ఉన్న అదిలాబాద్ రైల్వే లైన్, ఎయిర్ పోర్టు గురించి జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు నిలదీయక పోవడం, మౌనంగా ఉండటం సిగ్గు చేటని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కళ్లెం నారాయణరెడ్డి, కుమరం కోటేశ్వర్, జలైయి జాకు, కొత్తూరు లక్ష్మణ్, పట్ల గోవర్ధన్, చోలే ప్రభాకర్, అజీమ్, విజయ్ సింగ్, శేషారావు, సాదుల్లా, ముస్తఫా, మజీద్ ఖాన్, హారన్ మారుతి, ప్రవీణ్, బాలాజీ, వినాయక్, సంజు, కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ నాయకులను ప్రశ్నించండి: కాంగ్రెస్ పార్టీ పిలుపు



**వాస్తవ నేస్తం,బోథ్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, అంతకంటే ఎక్కువ అదిలాబాద్ జిల్లా వివక్షకు గురైనట్టు తాము భావిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి నిధులు అందకపోవడానికి నిరసిస్తూ బోథ్ బస్టాండ్ దగ్గర భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నల్ల బ్యాడ్జీలు ధరించి, వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పసుల చంటి మాట్లాడుతూ.. బీజేపీ ఎంపీ ఎమ్మెల్యేలకు వివిధ రూపాల ద్వారా ప్రజలు తమ యొక్క విజ్ఞప్తులు ఇచ్చిన, వాటన్నిటినీ పెడచెవిన పెట్టి కేవలం కాల కాలయాపన చేస్తున్నట్టు జిల్లా ప్రజలు భావిస్తున్నారని, ఇప్పటికైనా జిల్లాకి న్యాయంగా రావలసిన సీసీఐ పునరుద్ధరణ కోసం నిధులు, ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ కి నిధులు, ఆదిలాబాద్ ఎయిర్పోర్టు కి నిధులు, హైదరాబాద్ నాగపూర్ పారిశ్రామిక కారిడారికి నిధులు అనుమతులు తీసుకురావడంలో విఫలం అయ్యారని, ఏజెన్సీ ఏరియాలో, పర్వత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల నిర్వహణకి కూడా నిధులు కేటాయించకపోవడం నిజంగా ఆదిలాబాద్ జిల్లా పై వివక్షచూపడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోర్ల రాజు, బోథ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్,యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అరుణ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి చాట్ల ఉమేష్, సీనియర్ నాయకులు మెరుగు భోజన్న, రాజశేఖర్, గడ్డల నారాయణ, షేక్ ఆబుద్, షేక్ షాకీర్, ఉమేష్ జాదవ్, గూడూరు వంశీ రెడ్డి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు

## ప్రజా ప్రయోజనాలు విస్మరించిన బడ్జెట్ మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి



**వాస్తవ నేస్తం,తలమడుగు:** రాష్ట్రానికి జిల్లాలలోని ప్రాధాన్యలలను గుర్తించకుండా నిర్లక్ష్యంగా బడ్జెట్ ప్రవేశ పెట్టిన బీజేపీ కీ ప్రజలే గుణపాఠం చెబుతారు అని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం సుంకిడి మండల కేంద్రం లో అంబేద్కర్ విగ్రహనికి వినతి పత్రం అందించారు. మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో ఆదిలాబాద్ జిల్లాలోని కొత్త ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించలేదని సాక్షాత్తు ప్రధాన మంత్రి వచ్చిన జిల్లాకు విమానాశ్రాయం రైల్వే ప్రాజెక్టుల ఉసెత్తకుండా నిధులు కేటాయించకపోవడం చాలా దారుణం వెనుకబడ్డ ప్రాంతలైన దక్షిణ భారత దేశంలోని ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాలకు మొండి చెయ్యి చూపిందని ఈ దేశంలోని పేద అణగారిన వర్గాల సంక్షేమం కోసం ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం అంకెల గారడీ బడ్జెట్ అని ఏద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బాబన్న రాజేశ్వర్ విలాస్ లింగారెడ్డి అయ్యు భీంరావ్ దేవన్న లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి, మహబూబ్ నగర్‌లో బ్లేడ్ బ్యాచ్ హల్ చల్

**రంగారెడ్డి :** మణికొండలో గంజాయి బ్యాచ్ హల్ చల్ చేసిన వీడియో వెలుగులోకి వచ్చింది. గంజాయి మత్తులో పోచమ్మ కాలనీ యువకుడిని ఈ గ్యాంగ్ చితకబాదింది. ఈ ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. అయితే ఈ గ్యాంగ్ దాడి తర్వాత బైక్ వదిలి పరారైంది. పలు సార్లు పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువకుడి పై దాడి చేసిన గ్యాంగ్ పై రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గంజాయి బ్యాచ్ హడలెత్తిస్తున్నది. ఈ బ్యాచ్ పట్టణంలో రాత్రి అయితే చాలు ఎవరిపైనంటే వారిపై దాడులు చేస్తూ అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో గంజాయి బ్యాచ్ పాలమూరు పట్టణంలోని ఓ యువకుడిపై దాడి చేసిన ఘటన మరవకముందే మరో ఘటనలో రెండురోజుల కిందటే మహబూబ్‌నగర్ టు టౌన్ పోలీసులకు చిక్కారు. రెండు రోజుల కిందట న్యూటౌన్‌లోని గం జాయి బ్యాచ్ ఒకరిపై ఒకరు పదునైన ఆయుధాలతో దాడులకు పాల్పడుతుండగా స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మహబూబ్‌నగర్ డీఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

## కిషన్ రెడ్డిపై కేసు పెట్టాలి

**హైదరాబాద్ :** సంధ్య థియేటర్ తొక్కిసలాట సందర్భంగా రేవతి మృతి కారణమయ్యాడని హీరో అల్లు అర్జున్ మీద కేసు పెట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మరి ట్యాంక్ బండ్ వద్ద ఇద్దరి మరణానికి కారణమైన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీద సిటీ కమిషనర్ సీవీ ఆనంద్ ఎందుకు కేసు పెట్టలేదని కాంగ్రెస్ బహిష్కృత నేత బక్క జడ్సన్ ప్రశ్నించారు. అతని మీద కేసు పెట్టడానికి సీవీ ఆనంద్ ఎందుకు భయపడుతున్నాడని జడ్సన్ నిలదీశారు. 83 కేసులున్న క్రిమినల్ రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని పాలిస్తున్నాడు.. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మా తెలంగాణ ప్రజలను మోసం చేశారని తెలంగాణాలో ప్రభుత్వాన్ని రద్దు చేయాలని రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేశాని ఆయన అన్నారు. యూత్ డిక్లరేషన్ అని యువతను మోసం చేసి, 49 మంది విద్యార్థుల చావుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, రేవంత్ రెడ్డి కారణం అయ్యారని బక్క జడ్సన్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి 14 మందికి గాయాలు

**తిరుపతి :** వివాహ వేడుకకు హాజరై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, 14 మంది గాయపడ్డారు. ఈ దుర్ఘటన చిత్తూరు జిల్లా నగరి పట్టణ సమీపంలో రాత్రి చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం సీతారామపురం గ్రామానికి చెందిన వారు, తమిళనాడు రాష్ట్రం తిరుత్తణిలో జరిగిన వివాహానికి ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నగరి సమీపంలో బస్సు డ్రైవర్ ఒక వాహనాన్ని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించాడు. అదే సమయంలో పుత్తూరు నుంచి ఎదురుగా వేగంగా వస్తున్న లారీ బస్సును ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో సీతారామపురం గ్రామానికి చెందిన పార్థసారథి నాయుడు , రాజేంద్ర నాయుడు , తిరుపతికి చెందిన ధనుశ్ , తిరుత్తణికి చెందిన కుమార్ మృతి చెందారు.

## సరస్వతి శిశు మందిర్ అక్షరాభ్యాసం



**వాస్తవ నేస్తం,బోథ్:** పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో వసంత పంచమిని పురస్కరించుకుని సామూహిక అక్షరాభ్యాస మహొత్స వమును నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో రుటైర్డ్ ఎంఈఓ కుమ్మరి పోశెట్టి వసంత పంచమి విశిష్టతను, చదువుతోపాటు క్రమశిక్షణ, సంస్కారము, సంస్కృతి సాంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని కాపాడే ఏకైక పాఠశాలలు శిశు మందిరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చట్ల ఉమేష్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆర్టివి ప్రసాద్,శిశు మందిర్ పూర్వ విద్యార్థి నరేందర్, జక్కుల వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ రాజేంద్ర గౌడ్, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

## సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కి శుభాకాంక్షల వెల్లువవెల్లువ




**వాస్తవ నేస్తం,బోనకల్:** సీపీఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై ఖమ్మంకు తొలిసారిగా వచ్చిన సందర్భంగా జాన్ వెస్లీ కి సోమవారం పార్టీ కార్యాలయంలో పూల బొకేను అందించి సీపీఎం నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ.. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉండి కుల వివక్షతకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం జరగాలని, సమాజంలో అందరికీ న్యాయం, సమాన అవకాశాలు ఆర్థిక, రాజకీయ రంగాలలో అందరూ అభివృద్ధి కావాలని, జరగాలని ఎన్నో పోరాటాలు చేసి రాష్ట్ర వ్యాపిత ఉద్యమాలు, సైకిల్ యాత్రలో రాష్ట్రం మొత్తం తిరిగి సబ్ ప్లాన్ సాధనలో కీలక భూమిక పోషించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మధిర డివిజన్ మాజీ సభ్యులు వల్లంకొండ సురేష్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కర్లకుంట నరేష్, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# పులకరించిన సాయి వార్షికోత్సవ వేడుకలు

### సాయినాథుడి దర్శనానికి బారులు తీరిన భక్తులు

### వైభవంగా పూజలు.. కన్నుల పండువగా పల్లకి ఊరేగింపు







**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండల కేంద్రమైన ఇచ్చోడ లోని సాయి బాబా ఆలయంలో నిర్వహించిన 25 వ వార్షి కోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరి గాయి. వేడుకలు భక్తులతో పులకరించిపోయింది.
వేడుకలకు భక్తులు ఉదయం నుంచే అధిక సంఖ్యలో తరలిరావడంతో ఇచ్చోడ పట్టణం సోమవారం జన సంద్రమైంది. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిట లాడింది. ఆలయ కమిటీ అధ్యక్షులు గూడూరు ముత్యం రెడ్డి, ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో కాకాడి పూజ, హొమం, పాలాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయి నాథుడి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

**కన్నుల పండుగ పల్లకి ఊరేగింపు...**

కదిలింది శ్రీ సాయి పల్లకి... కరుణామయుడి పూల పల్లకి అంటూ భక్తులు సాయి పల్లకిని కన్నుల పండువ గా ప్రధాన వీధుల వెంట ఊరేగించారు. భక్తులు పాట లు పాడుతూ, నృత్యాలు చేస్తూ పల్లకిని ఊరేగిం చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం అన్నదానం చేపట్టారు. వేడుకల నేపథ్యంలో ఒక రోజు జాతర నిర్వహించారు. జాతరలో పెద్ద సంఖ్యలో దుకాణాలు, సర్కస్, ఆట, పాట వస్తువులు వెలి సాయి. పోలీస్ బందో బస్తిని ఏర్పాటు చేసారు. అదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడి గొండ, బజార్ హత్నూర్, సిరికొండ, సొనాల మండ లాల నుంచి భక్తులు తరలివచ్చారు.

## ప్రియుడి కోసం భర్తను చంపి

**శ్రీకాకుళం :** సంచలనం రేపిన శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం బొబ్బిలిపేటలో కిందటి నెల 25న జరిగిన వైసిపి నాయకుడు చంద్రయ్య హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసు దర్యాప్తులో పోలిసులకు విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి.ఈ హత్య కేసులో భార్య ఈశ్వరమ్మతో పాటు మొత్తం పది మందిని నిందితులుగా గుర్తించారు. అదుపులోకి తీసుకున్న నిందితుల్లో ఒకరు 15 ఏళ్ల మైనర్ కూడా ఉన్నాడు. ఈ కేసులోభార్య వివాహేతర సంబంధమే భర్తకు శాపంగా మారి చివరకు అతని ప్రాణాల్ని బలితీసిందని తేల్చారు పోలిసులు.మృతుడు గురుగుబిల్లి చంద్రయ్య భార్య ఈశ్వరమ్మ(32)తో అదే గ్రామానికి చెందిన చింతాడ బాలమురళి కృష్ణ(35)అనే యువకుడుకి వివాహేతర సంబంధం ఉంది. వారి వివాహేతర సంబందం భర్త చంద్రయ్యకు తెలిసి పలుమార్లు భార్యను నిలదీసాడు చంద్రయ్య. ఈశ్వరమ్మకు, బాలమురళీకృష్ణకు మధ్య ఎటువంటి సమాచారం ఉండకూడదని తలచి ఆమె ఫోన్ కూడా తీసుకున్నాడు చంద్రయ్య. అయితే తర్వాత గుట్టుగా వేరే ఒక ఫోనును బాలమురళీ? ఈశ్వరమ్మకి ఇచ్చాడు. దీంతో ఇద్దరు రహస్యంగా ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉండేవారు. ఈ క్రమంలోనే వారు శారీరకంగా కలవడానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి అతడ్ని అంతం చేయాలని తలచారు. దీని కోసం వరుసకు తమ్ముడు అయిన ఆమదాలవలస మండలం శ్రీనివాసచార్యులపేటకి చెందిన అరవింద్‌ను సంప్రదించాడు బాలమురళీ కృష్ణ. అరవింద్ గతంలో ఒక డాబాను నిర్వహించేవాడుఅప్పట్లో దాబాలో పనిచేసే బూర్జ మండలం ఉప్పినివలసకి చెందిన గొల్లపల్లి వంశీ, సవలపురం గణేశ్, ప్రవీణ్, బొమ్మాళీ శ్రీ వర్ధన్, ఉమా మహేశ్, ఆమదాలవలస మండలం ఈశర్లపేటకి చెందిన కృష్ణ అనే యువకుల ద్వారా చంద్రయ్యను మర్డర్ చేసేందుకు పూనుకున్నాడు.ఈ గ్యాంగ్ ఆమదలవలసలోని స్థానిక డాబాలో బీర్లను సేవించి మూడు రోజులు రెక్కీ చేసి నాలుగవ రోజు బైక్ పై వస్తున్న చంద్రయ్యను దారి కాసి బీరు సీసాలు, కర్రలతో విచక్షణ రహితంగా చనిపోయినంత వరకు చంద్రయ్యను కొట్టారు నిందితులు. ఆపై చంద్రయ్య మృతదేహాన్ని గోనె సంచిలో వేసి ఆయనను చెరువు వరకు ఈడ్చుడు వెళ్లి అక్కడ పడేసారు. చంద్రయ్యను హత్య చేసిన తర్వాత అతని భార్య ఈశ్వరమ్మతో ఫోన్లో మాట్లాడి నీ భర్తని హత్య చేసేసాము ఇక మనకు ఎవరు అడ్డు లేరని ఆమెతో బాలమురళీ కృష్ణ చెప్పాడు.చంద్రయ్య స్థానిక వైసిపి నేత. అయితే గతంలో ఇదే గ్రామంలో రాజకీయ కక్షలతో ఇద్దరి హత్య గావించబడ్డారు. ఈ నేపథ్యంలో మొదట చంద్రయ్యది కూడా రాజకీయ హత్యే అయి ఉంటాదని అంతా భావించారు. అయితే కొందరు స్థానికులు హత్యకు ముందు ఆ మార్గంలో బైక్‌లతో కొందరు వ్యక్తులు చాలా సేపు ఉన్నారని , మద్యం కూడా సేవిరించారని చెప్పడంతో పోలీసులు దానిపై దర్యాప్తు చేపట్టుగా నిందితులు దొరికిపోయారు.నిందితులు హత్యకు ఉపయోగించిన ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. నిందితులను స్థానిక ఆముదాలవలస కోర్టులో హాజరు పరిచారు. హత్యలో పాల్గొన్న వ్యక్తులందరూ సమీప గ్రామ యువకులే.

# సరికొత్త రికార్డ్స్ సృష్టించిన వెంకీమామ..

## భారీ మైల్డ్ స్టోన్ దాటేసిన సంక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన లేటేస్ట్ మూవీ సంక్రాంతికి వస్తున్నాం. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో విడుదలైంది. మొదటి రోజే భారీ విజయాన్ని అందుకున్న ఈ సినిమా ఇప్పటికీ బాక్సాఫీస్ ను షేక్ చేస్తుంది. అడియన్స్ ఊహలకు మించి సూపర్ హిట్ టాక్ తో దూసుకుపోతుంది. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వచ్చిన ఈ సినిమాలో వెంకటేశ్ జోడిగా ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించారు. ఇప్పటికే వెంకీమామ కెరీర్ లోనే హాయేస్ట్ కలెక్షన్స్ రాబట్టిన సినిమాగా సంక్రాంతికి వస్తున్నాం నిలిచిపోయింది. తాజాగా ఈ సినిమా భారీ మైల్ స్టోరీ దాటింది. దీంతో ఇప్పటివరకు సంక్రాంతి బరిలో నిలిచిన హీరోలలో వెంకటేశ్ రికార్డ్ సృష్టించారు. తాజాగా సంక్రాంతికి వస్తున్నాం సినిమా రూ.300 కోట్ల క్లబ్ లోకి అడుగుపెట్టేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రూ.303 కోట్ల గ్రాస్ రాబట్టిందని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. రీజనల్ చిత్రాల్లో ఆల్ టైమ్ ఇండస్ట్రీ హిట్ అంటూ పేర్కొంది. 20 రోజుల్లోనే దాదాపు రూ.303 కోట్లు సాధించి బాక్సాఫీస్ షేక్ చేసింది ఈ మూవీ. కేవలం రూ.50 కోట్ల లోపు బడ్జెట్ తోనే రూపొందించిన ఈ సినిమా.. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ భారీ వసూళ్లు కొల్లగొట్టేసింది.

**మిర్చి సినిమా బ్యూటీ గుర్తుందా.. ?**

ఇదిలా ఉంటే.. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో అటు మేకర్స్.. ఇటు డిస్ట్రిబ్యూటర్లకు సైతం లాభాలు వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇటీవలే డిస్ట్రిబ్యూటర్స్ ప్రెస్ మీట్ సైతం నిర్వహించారు. ఈ చిత్రంతో భారీ లాభాలను గడించామని వెల్లడించారు. ఈ వేడుకలో నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ సైతం పాల్గొన్నారు.



## పెళ్లి తరువాత
## ఫస్ట్ ప్రాజెక్ట్ స్టార్ట్ చేసిన మెగా కోడలు

మెగా హీరో వరుణ్ తేజ్ అందాల భామ లావణ్య త్రిపాఠిని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. హీరోయిన్ లావణ్య అందాల రాక్షసి సినిమాతో హీరోయిన్ గా అడుగుపెట్టింది. హనురాఘవపుడి దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాలో లావణ్య తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.ఇక ఈ సినిమా తర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది ఈ చిన్నది. కానీ అనుకున్నంత గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. ఇక ఈ అమ్మడు మెగా హీరో వరుణ్ తేజ్ ను ప్రేమించి పెళ్లాడింది. ఈ ఇద్దరూ కలిసి మిస్టర్, అంతరిక్షం సినిమాలు చేశారు. మిస్టర్ సినిమా సమయంలో ఈ ఇద్దరూ ప్రేమలో పడ్డారు. చాలా కాలం ఈ ఇద్దరూ తమ ప్రేమను సీక్రెట్ గా ఉంచారు. ఎంగేజ్ మెంట్ కూడా సైలెంట్ గానే చేసుకున్నారు. అలాగే పెళ్లి కూడా విదేశంలో చేసుకున్నారు. ఆ తర్వాత సుమారు ఏడాదిపాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చింది లావణ్య. అయితే ఈ చిన్నది సినిమాలకు గుడ్ బై చెప్పేసిందని అంతా అనుకున్నారు. కానీ ఇప్పుడు పెళ్లి తర్వాత తొలి సినిమాను అనౌన్స్ చేసింది. లావణ్య ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న సినిమా 'సతీ లీలావతి'. దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాల సంయుక్త నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం.1గా ఈ సినిమా రూపొందనుంది. తాజగా ఈ సినిమా పూజాకార్యక్రమాలతో మొదలైంది. ఈ సినిమాకు తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో ఆయన భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) వంటి సినిమాలను తెరకెక్కించాడు. ఈ సినిమాలో లావణ్యకు జోడిగా దేవ్ మోహన్ నటిస్తున్నాడు. ఈ సినిమా రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కుతుంది. మరి ఈ సినిమా లావణ్యకు ఎలాంటి హిట్ ఇస్తుందో చూడాలి.



## నేను సినిమాల్లోకి రావడానికి కారణం ఆమె..

**నిధి అగర్వాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్**


అందాల భామ నిధి అగర్వాల్ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చిన ఈ చిన్నది ఇప్పుడు తెలుగులో క్రేజీ ఆఫర్స్ ఆ అందుకుంటుంది. యంగ్ హీరోలతో మొదలు పెట్టి ఇప్పుడు స్టార్ హీరోలతో సినిమాలు చేసే రేంజ్ కు ఎదిగింది ఈ వయ్యారి భామ. నాగ చైతన్య నటించిన సవ్యసాచి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది.తొలి సినిమా ఫ్లాప్ అయినా కూడా ఈ అమ్మడు మంచి మార్కులు కొట్టేసింది. ఆతర్వాత అక్కినేని హీరో అఖిల్ సరసన సినిమా చేసింది. అఖిల్ నటించిన మిస్టర్ మజ్ను సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో సక్సెస్ అవ్వలేదు. వరుస ఫ్లాప్స్ పలకరిస్తున్న సమయంలోనే పూరి సినిమాలో ఛాన్స్ అందుకుంది. పూరిజగన్నాథ్ దర్శకత్వలో తెరకెక్కిన ఇస్మార్ట్ శంకర్ సినిమాలో ఛాన్స్ అందుకుంది. ఈ సినిమా లో నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకుంది ఈ వయ్యారి. ఓ రేంజ్ లో అందాలు ఆరబోస్తూ అభిమానులను కవ్వించింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తర్వాత క్రేజీ ఆఫర్స్ అందుకుంది. ఇక ఇప్పుడు ప్రభాస్ రాజా సాబ్, పవన్ కళ్యాణ్ హరిహరవీరమల్లు సినిమాలో నటిస్తుంది. ఈ రెండు సినిమాల షూటింగ్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రెండు సినిమాల షూటింగ్స్ లో బిజీగా గడుపుతున్న ఈ అమ్మడు తాజాగా చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ బీగా మారాయి. నిధి అగర్వాల్ అంత ఈజీగా హీరోయిన్ అవ్వలేదు. ఎన్నో కష్టాలు భరించింది ఈ అమ్మడు. మొదటి సినిమా సమయంలో దాదాపు రెండేళ్లు సినిమా ఆఫీసుల చుట్టూ తిరిగిందట. తన కష్టాల గురించి ఓ ఇంటర్వ్యూలో నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె చూసి తాను కూడా సినిమాల్లోకి రావాలనుకున్నా.. ఆమెను ఇన్స్పిరేషన్‌గాతీసుకున్నా.. మొదట్లో ఇంట్లో ఒప్పుకోలేదు. ఆతర్వాత నన్ను ఎంకరేజ్ చేశారు. దాదాపు రెండేళ్ల పాటు ఆఫీసుల చుట్టూ తిరిగాను. ఆఫీసుల చుట్టూ తిప్పించుకొని ఆతర్వాత అవకాశం లేదు అంటూ పంపించేశారు. మైఖేల్ మున్నా సినిమా ఆడిషన్‌కి వెళ్తే దాదాపు 300 మందిలో అదృష్టం బాగుండి నేను సెలక్ట్ అయ్యాను.



## ఓటీటీలోకి వచ్చిన తర్వాత థియేటర్స్‌లోకి సిద్దు సినిమా



స్టార్ బాయ్ సిద్ధూజొన్నల గడ్డ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేసి ఆయా షూటింగ్స్ తో జోరుమీదున్నాడు. సిద్దు నటించిన డీజే టిల్లు , టిల్లు స్క్వేర్ సినిమాలు భారీ హిట్స్ గా నిలిచాయి. దాంతో సిద్దు పేరు మారుమ్రోగింది. అంతే కాదు యూత్ లో సిద్దు క్రేజ్ విపరీతంగా పెరిగింది. సిద్దు త్వరలోనే జాక్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సినిమాలో హీరోయిన్ గా బేబీ బ్యూటీ వైష్ణవి చైతన్య హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే డీజే టిల్లు సినిమా కంటే ముందు సిద్దు కొన్ని సినిమాలో చిన్న చిన్న పాత్రలు చేశాడు. అలాగే హీరోగానూ కొన్ని సినిమాలు చేశాడు. కానీ ఆ సినిమాలు ఈ యంగ్ హీరోకి అంతగా గుర్తింపు తీసుకురాలేదు. లైఫ్ బిఫోర్ వెడ్డింగ్ అనే సినిమాతో సిద్దు హీరోగా పరిచయం అయ్యాడు. బాయ్ మీట్స్ గర్ల్, గుంటూర్ టాకీస్, కృష్ణ అండ్ హిజ్ లీలా, మా వింత గాధ వినుమా వంటి సినిమాల్లో నటించాడు. ఇక ఇప్పుడు ఈ సినిమాల్లో ఓ సినిమా రీ రిలీజ్ కు రెడీ అవుతుంది. సినిమాఓటీటీలోకి వచ్చిన ఐదేళ్ల తర్వాత థియేటర్స్ లో పలకరించడానికి వస్తుంది. ఆ సినిమానే కృష్ణ అండ్ హిజ్ లీలా. ఈ సినిమా ఆసక్తికర కథతో తెరకెక్కింది. ఈ చిత్రాన్ని రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించగా సురేశ్ ప్రొడక్షన్స్, వయాకామ్ 18 స్టూడియోస్, సంజయ్ రెడ్డి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమాలో శ్రద్దా శ్రీనాథ్, షాలిని వడ్నికట్టి, సీరత్ కపూర్ హీరోయిన్స్ గా నటించారు. ఈ సినిమా అందమైన ప్రేమ కథగా తెరకెక్కింది. ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించాడు. కాగా ఈ సినిమా కరోనా కారణంగా లాక్ డౌన్ ప్రకటించడంతో 'ఆహా' ఓటీటీలో 2020, జూలై 4న డైరెక్ట్ గా విడులైంది. ఇక ఇప్పుడు ఈ సినిమాను థియేటర్స్ లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇట్స్ కాంప్లికేటెడ్ అనే పేరుతో ఈ సినిమాను విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం పురస్కరించుకొని ఈ సినిమాను థియేటర్స్ లో విడుదల చేయనున్నారు.



## చూస్తున్నంత సేపూ కన్నీళ్లు వచ్చాయి

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 ఎంత పెద్ద విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన ఆవరసం లేదు. ఇండియన్ షేక్ చేసింది ఈ సినిమా. ఇండియన్ మూవీ మూవీస్ రికార్డ్స్ ను బ్రేక్ చేసింది ఈ సినిమా ఏకంగా రూ . 18వందల కోట్లకు పైగా వసూల్ చేసింది పుష్ప 2. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటించింది. గతంలో వచ్చిన పుష్ప సినిమా మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. పుష్ప భారీ విజయం సాధించడంతో పుష్ప 2 పై భారీ ఆ అంచనాలు క్రియేట్ అయ్యేయి ఊహించినట్టే పుష్ప 2 సినిమా విడుదలై సంచలనం సృష్టించింది. థియేటర్స్ లో దుమ్మురేపిన పుష్ప 2 సినిమ ఇప్పుడు ఓటీటీలో అదరగొడుతుంది. పుష్ప 2 సినిమాకు సంక్రాంతి కానుకగా రీ లోడెడ్ వర్షన్ ను విడుదల చేశారు. కొన్ని సీన్స్ యాడ్ చేసి రీలోడెడ్ వర్షన్ ను రిలీజ్ చేశారు. ఇక ఇప్పుడు ఓటీటీలో కూడా పుష్ప 2 రీ లోడెడ్ వర్షన్ రిలీజ్ అయ్యింది. పుష్ప 2 సినిమాలో అల్లు అర్జున్ నటన పై అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా అల్లు అర్జున్ సోదరుడు, నటుడు శిరీష్ కూడా పుష్ప 2 సినిమా పై స్పందించాడు. సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్ట్ షేర్ చేయాడు శిరీష్. పుష్ప 2 సినిమాను ఓటీటీలో చూసి తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు శిరీష్. థియేట్రికల్ వెర్షన్ లో మిస్సయిన లింక్స్ అన్నిటినీ కవర్ చేసారని శిరీష్ చెప్పుకొచ్చాడు. 'పుష్ప 2' క్లైమాక్స్ లో పుష్పరాజ్ తన ఇద్దరు సోదరులను పట్టుకొని ఏడుస్తున్న సన్నివేశాన్ని ఫోటో తీసి అల్లు శిరీష్ ఇన్స్టా స్టోరీలో పోస్ట్ చేశాడు. దాని కింద "రీలోడెడ్ వెర్షన్ చాలా హై ఇచ్చింది. సినిమా చివరి వరకూ కన్నీళ్లు వచ్చాయి. థియేట్రికల్ వెర్షన్ లో మిస్

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com